క్లుప్తంగా

గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుటున్న అమ్మవారు

ఆస్పరి: స్థానిక రామ తీర్థంలో వెలసిన గాయత్రీదేవి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఆకుపూజ, కుంకుమార్చనలు నైవేద్యం సమర్పణ అనంతరం మంగళహారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చేపల పెంపకానికి వేలం నిర్వహించాలి



మాట్లాడుతున్న పందికోన గ్రామస్తులు

పత్తికొండ రూరల్: పత్తికొండ మండల పరిధిలోని పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి మత్స్యశాఖ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించాలని పందికోన గ్రామస్తులు శ్రీరాములునాయుడు, జటంగిరాజు, బాలరాజుగౌడ్, రంగన్న, బాలకృష్ణనాయుడు కోరారు. శుక్రవారం స్థానిక పబ్లిక్ రీడింగ్ రూం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ నాటికి చేపల వేలం పాట గడువు ముగుస్తుందన్నారు. తరువాత ప్రైవేటు వ్యక్తులు చేపలు పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చేపల వేలం వివాదాస్పదంగా మారిందని ఈసారి అలా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు.

రేపటి నుంచి విజయేంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు



రాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మూలవిరాట్‌లు

హొళగుంద: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వెలిసిన విజయేంద్ర తీర్థుల 410వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జూలై 1న పూర్వారాధన, 2న ఏకాదశి, 3న మధ్యారాధన, 4న ఉత్తరాధన కార్యక్రమాలు జరగనున్నాయి. భజన కార్యక్రమాలతో పాటు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, స్వస్తివాచన, మహా మంగళహారతి, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

దేవరగట్టులో వరుణయాగ పూజలు



పూజలు చేస్తున్న వేద పండితులు

హొళగుంద: దేవరగట్టు శ్రీమాళ మల్లేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం వరుణయాగ పూజలు ప్రారంభమయ్యాయి. ఎల్లెల్సీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి, ఆయన సతీమణి సమ్మతగేరి సర్పంచ్ శోభా ఆధ్వర్యంలో వేద పండితుడు బెళ్లోణ రామశాస్త్రీ చేతుల మీదుగా పూజలు జరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మూడు రోజుల పాటు పూజలు చేయనున్నట్లు నిర్వాహకుడు రామిరెడ్డి తెలిపారు. ముగింపు రోజు ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

పాఠశాల విభజనకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఇంగ్లిష్, తెలుగు, కన్నడ, ఉర్దూ మీడియంలను రెండు సెక్షన్లుగా విభజించి వేర్వేరు పాఠశాలలు ఏర్పాటు చెయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు శుక్రవారం అమరావతిలో మోడల్ స్కూల్ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేడీ సర్వీసెస్ మువ్వా రామలింగంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర: స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహంలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ అధికారి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థికి సంబంధించిన ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను అందించి ప్రవేశం పొందాలని సూచించారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా నిల్వలు



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది



పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

మద్దికెర: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో ఆయా టీకాలు, వ్యాక్సిన్లు వేయిస్తే వ్యాధు లు దరిచేరకుండా జీవితాంతం ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. అయితే చాలామంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేక వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లు ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన 3 నెలలు నిండిన తరువాత టీటీ ఇంజెక్షన్ వేయాలి. నెల రోజుల వ్యవధిలో మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం ట్యాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటిస్–బి డోస్ వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.
- 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితోపాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి.
- 5 ఏళ్లు పూర్తయిన తరువాత డీపీటీ డోస్ వేయించాలి.
- 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీటీ) వేయించాలి.
- 9 నెలల నుంచి 5 ఏళ్ల వయసు వరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం 9 డోసులు వేయించాలి.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై తమ సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– రాగిణి, ప్రభుత్వ వైద్యాధికారి, మద్దికెర

నేడు గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

ఆలూరు: మండలంలోని అరికెర ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 6వ తరగతిలో ఎస్సీ విద్యార్థులకు ఖాళీగా ఉన్న 10 సీట్లకు 240 దరఖాస్తులు, ఎస్టీ ఒక సీటుకు 20, బీసీ ఒక సీటుకు 25 దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే 9వ, తరగతిలో 5 సీట్ల (ఎస్సీ)కు 87 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 15 రూమ్‌లను సిద్ధం చేశామని.. విద్యార్థులు 9 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ర్యాంకు కార్డులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించిన పరీక్ష ఫలితాలకు సంబంధించి ర్యాంకు కార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షబానాబేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 20, 21 తేదీల్లో పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ర్యాంకు కార్డులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

క్రీడా సామగ్రి వితరణ



వెల్దుర్తి బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ శైలజకు క్రీడా సామగ్రి అందిస్తున్న దాతలు

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించేందుకు తగిన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, ప్రస్తుతం హిందీ పండిట్ గఫూర్, ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ ఖాజా హుసేన్ అన్నారు. వారు శుక్రవారం వెల్దుర్తి బాలికల బీసీ హాస్టల్‌కు క్రీడా వస్తువులను వితరణ చేశారు. ఈ మేరకు వార్డెన్ శైలజకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో 600 మంది బాలికలు ఉన్నారని, వీరు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. సదరు బ్యాచ్ దాతలు ఇప్పటికే పుస్తకాల ర్యాంపు అందజేశారని, ప్రస్తుతం ఆట వస్తువులు అందించడంతో కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు కుమ్మరి శ్రీనివాసులు, వడ్ల మహేష్, శివరామిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, జాకీర్‌హుసేన్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



వరిముక్కల గ్రామంలో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: పరిసరాల శుభ్రత, దోమల నివారణతో వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని వరిముక్కల గ్రామంలో శుక్రవారం డ్రైడే–ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఎక్కువ కాలం ఇళ్ల వద్ద డ్రమ్ములు, తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచుకోరాదని సూచించారు. నీరు ఉన్నచోట దోమలు గుడ్లు పట్టే అవకాశం ఉంటుందని.. తద్వారా వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో మెరుపులు



రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించిన విద్యార్థిని నందినిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

పత్తికొండటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి పీజీ సెట్‌లో మంచి ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి తెలిపారు. సెట్‌లో రాణించిన విద్యార్థులను కళాశాల బృందంతో కలిసి అభినందించారు. పత్తికొండ తెరుబజారుకు చెందిన జె.నందిని రాష్ట్రస్థాయి ఫిజిక్స్ విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే డీకే రాజేశ్వరి–47, కే. మౌనిక–94, పి.హుసన్‌బీ–103, శ్రీలత–425, కుసుమ–426 ర్యాంకులతో మెరిశారన్నారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వీరికి కోచింగ్ ఇచ్చిన ఫిజిక్స్ విభాగ ఇన్‌చార్జ్ సాయి శశిధర్‌ను అభినందించారు. కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉస్మాన్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే డయేరియా దూరం



మరకట్టులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవి

ఆలూరు రూరల్: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. శుక్రవారం మండలంలోని మరకట్టు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. దోమల బారి నుంచి కాపాడుకునేందుకు దోమ తెరలు వాడాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వాంతులు, విరేచనాలు అవుతుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ తాగాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి



ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన బీసీ సంఘం నాయకులు

మద్దికెర: కేజీబీవీల్లో సీట్లు పెంచి విద్యార్థినుల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటునందించడంతో పాటు బీసీ హాస్టళ్లను మరింత మెరుగుపరచాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజును కలిసి విన్నవించగా అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారన్నారు. కేజీబీవీల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉండడంతో చాలా మంది విద్యార్థినులు చదువుకు దూరం కావడంతో పాటు తల్లిదండ్రుల వెంట వలసలు పోతున్నారన్నారు. అలాంటి వారికి విద్యా అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే బీసీల అభ్యున్నతికి తోడ్పాటునందించాలని కోరామన్నారు. బీసీ కార్పొరేషన్ నిధులు అర్హులైన వారందరికీ అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మొలగవల్లి గ్రామంలో ఎంపీఈహెచ్‌ఓ అంద్రూస్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ఇళ్లలోని డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోరాదన్నారు. దోమల బారి నుంచి కాపాడుకునేందుకు దోమతెరలు వాడాలని సూచించారు. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

వసతి గృహాల్లో అడ్మిషన్లు ఫుల్

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు క్యూ కట్టారు. చుట్టుప్రక్కల గ్రామాల వారే గాకుండా దూర ప్రాంతాల విద్యార్థులు ఈ పాఠశాలలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. పాఠశాలలో చేరిన వారికి వసతి కల్పించేందుకు ఇక్కడి బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో పరిమితికి మించి విద్యార్థులు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే బీసీ హాస్టల్‌లో నాలుగు వందల మంది ఉండగా కొత్తగా మరో మూడు వందల మంది ఈ యేడాది దరఖాస్తు ఇచ్చారు. అలాగే ఎస్సీ హాస్టల్‌లో కూడా పరిమితి మించి ఉండటంతో ఈ రెండు హాస్టళ్లలో అడ్మిషన్ క్లోజ్ బోర్డులు పెట్టినట్లు వార్డెన్లు వెంకటేశ్వర్లు, శంకర్ తెలిపారు. ఉన్నతాధికారులు ఈ హాస్టళ్లలో సీట్లు పెంచి పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందేలా చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తాం

మద్దికెర: కులగణనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి విచారణ చేసి కుల ధ్రువీకరణ పత్రాలు అందించడం జరుగుతుందని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. ఆయన శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌కు ముందు దాదాపు 4 వేల మంది కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిపై విచారణ జరిపి అర్హులందరికీ కులధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సత్వరం మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులందరికీ విద్యా కిట్లు

తుగ్గలి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ విద్యా కిట్లను అందిస్తామని ఎంఈఓ–2 రామ వెంకటేశ్వర్లు శుక్రవారం పేర్కొన్నారు. మండలానికి చేరిన విద్యా కిట్లను ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల సీఆర్పీల పర్యవేక్షణలో ఇప్పటికే పాఠశాలలకు చేర్చి విద్యార్థులకు అందించామన్నారు. మండలంలో 10 జెడ్పీ ఉన్నత, 10 ప్రాథమికోన్నత, 44 ప్రాథమిక పాఠశాలల్లో 7,174 మంది విద్యనభ్యసిస్తున్నారన్నారు. వీరందరికీ 59,092 పాఠ్యపుస్తకాలు రావాల్సిఉండగా, 7వ తరగతి పాఠ్యపుస్తకాలు మినహా మిగతావన్నీ వచ్చాయన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, షూస్, బెల్టు వచ్చాయని వాటన్నింటినీ విద్యార్థులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

1 నుంచి పింఛన్ల పంపిణీ

తుగ్గలి: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జూలై 1 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 7,766 మందికి పంపిణీ చేసేందుకు రూ.5,29,39,500 మంజూరైందన్నారు. పెంచిన రూ.4వేలతో పాటు, ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించి (రూ.వెయ్యి చొప్పున) రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేస్తారని చెప్పారు. పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

5న శ్రీశైలం తాత ఆరాధనోత్సవాలు



ములుగుందంలోని శ్రీశైలం తాత సమాధి

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన అవధూత శ్రీశైలం తాత 13 ఆరాధనోత్సవాలు జూలై 5వ తేదీ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ రోజు తాత సమాధికి గంగపూజ, ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి, సాయంత్రం తాత విగ్రహం ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. భక్తులకు అన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీలు

ఆరాధనోత్సవాల సందర్భంగా జూలై 5వ తేదీ రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, క్రిష్ణమూర్తి, మల్లికార్జున రెడ్డి, చిన్నయ్యప్ప, పూజారి రంగస్వామి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అదే రోజు సాయంత్రంలోగా రూ. 300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతిగా ఆరు గ్రాముల బంగారం, రెండో బహుమతి 5 గ్రాముల బంగారం, మూడో 4 గ్రాములు, నాలుగో, ఐదు బహుమతుగా 22,19 తులాల వెండి బహూకరించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9505286102, 6304167849, 9618623263 నంబర్లను సంప్రదించాలన్నారు.



హత్తిబెళగల్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరిగిన ముళ్లకంపలు

కూలేందుకు సిద్ధం

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



ఆలూరు ఎస్ఎల్ఎన్ఎస్ టాకీస్ వెనుక కూలేందుకు ఉన్న స్తంభం



హత్తిబెళగల్ - ఆలూరు రహదారిలో ప్రమాదకరంగా మారిన తీగలు

ఆలూరు రూరల్: విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యపు నీడలో ఉన్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ప్రమాదం సంభవిస్తేగాని ఆ శాఖ అధికారులు స్పందించేలా లేరు. ఆలూరు–హత్తిబెళగల్ గ్రామాల రహదారి నుంచి వెళ్లిన 132 కేవీ విద్యుత్ లైన్ విద్యుత్ స్తంభం పైభాగంలోని క్రాస్ ఆర్మ్ నట్టుబోల్టు ఊడిపోయింది. వర్షాకాలంలో బలమైన ఈదురుగాలులు వస్తే హైఓల్టేజ్ తీగలు రోడ్డుపై పడే ప్రమాదం ఉంది. ఈ రహదారిపై నిత్యం ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అదే రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లకంప చెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్థానిక ఎస్ఎల్ఎన్ఎస్ టాకీస్ వెనుక ఎల్‌టీ లైన్ విద్యుత్ స్తంభం విరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్నా.. ఆ శాఖ అధికారులకు కనిపించడం లేదు.

ఎల్లెల్సీలో నీటి ప్రవాహం



హొళగుంద సెక్షన్‌లోని తుంగభద్ర దిగువ కాలువలో పారుతున్న నీరు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) హొళగుంద సెక్షన్‌లోని కాలువలో శుక్రవారం నీటి ప్రవాహం జరిగింది. కాలువలో మూడు అడుగుల మేర నీరు ఉండడంతో టీబీ డ్యాం నుంచి కాలువకు నీటిని వదిలారా అని ప్రజలు, రైతులు చర్చించుకున్నారు. వాస్తవంగా కాలువ ఆధునికీకరణ పనుల కారణంగా సీసీ బెడ్డింగ్ ఉండడంతో ఎక్కడ నీరు ఇంకిపోలేని స్థితిలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో నీరు చేరింది. కొన్ని చోట్ల రైతులు కాలువలో నీటికి అడ్డువేసి కొద్ది రోజుల తర్వాత తొలగించడంతో ఆ నీరు ముందుకు వస్తున్నాయి. ఈ ప్రవాహాన్ని చూసి కాలువకు నీరు వదిలారని అనుకుంటున్నారు. ఇదిలా ఉండగా బళ్లారి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు టీబీ బోర్డు అధికారులు ఈ నెల 22 నుంచి వంద క్యూసెక్కులు, కొన్నిసార్లు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయితే ఆ నీరు 180 కి.మీ పరిధిలోని హొళగుంద సెక్షన్‌లోని కాలువ వరకు వచ్చే అవకాశాలు లేవు. వర్షపు నీరు కాలువలో భారీగా చేరడంతో జలకళ సంతరించుకుంది.

ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి

హొళగుంద: మండలంలో భూస్వాములు, రాజకీయ నాయకులు, దళారులు ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ పంపాపతి, దిడ్డి వెంకటేష్, తిప్పన్న, జాకీర్, బెనకప్ప, ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ప్రభుత్వ భూముల గురించి ఆరా తీశారు.

పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఈ–కేవైసీ తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ శివశంకర్

హాలహర్వి: పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని చింతకుంటలో మురడి ఆంజనేయస్వామి ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. న్యూ యాంకర్ కంపెనీకి చెందిన ఖుషి ప్రోడక్ట్‌కు సరైన ఇన్‌వాయిస్, కంపెనీ పత్రాలు లేనందున అమ్మకాలు నిలుపుదల చేశామని, వాటి విలువ రూ.1,99,600గా ఉందన్నారు. అనంతరం చింతకుంటలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలానికి 60 మట్టి నమూనాలను లక్ష్యంగా ఇచ్చారని.. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో 43 నుంచి 45 వరకు మట్టి నమూనాలను సేకరిస్తామని తెలిపారు.